
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి

5

మెదక్

జిల్లాల వార్తలు

శుక్రవారం 29 ఆగస్టు 2025

సంగారెడ్డి జిల్లాలో 717 ఉపాధ్యాయ ఖాళీలు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతులతో 717 టీచర్ల పోస్టులు ఖాళీగా ఏర్పడ్డాయి. 637 ఎస్జీటీ, మిగిలినవి స్కూల్‌అసిస్టెంట్ పోస్టులు. దీంతో మరోసారి ఉపాధ్యాయుల సర్దుబాటు తప్పేలా లేదని నిపుణులు పేర్కొంటున్నారు. గత నెల సర్దుబాటులో భాగంగా 342 మంది టీచర్లను అవసరమైన చోటుకు బదిలీ చేశారు. తాజాగా ఏర్పడ్డ ఖాళీలను భర్తీ చేసేందుకు వచ్చే నెలలో మళ్లీ సర్దుబాటు చేసే అవకాశం ఉందని విద్యాశాఖ వర్గాలు తెలిపారు.



కొలువుదీరిన
గణనాథులు
భక్తిశ్రద్ధలతో పూజలు 8

వర్షంలో సైతం..
యూరియా కోసం
రైతులకు తప్పని తిప్పలు 7

ఉత్తర్‌పల్లి గ్రామంలో
జపాన్ బృందం 7

జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వినాయకచవితి

సంగారెడ్డి రామ్‌మందిర్ గణపతి మండపంలో భజన, పూజలు

సంగారెడ్డి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణంలోని రామ్‌మందిర్ ఆవరణలో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వయంగా భజన మండలి సభ్యులతో కలిసి ఆయన భక్తి గీతాలు ఆలపించి ఆకట్టుకున్నారు. పూజల్లో జగ్గారెడ్డి సతీమణి టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, కూతురు జయారెడ్డి, అల్లుడు గుణచైతన్యరెడ్డి, కొడుకు దత్తసాయి రెడ్డి, రామ్‌మందిర్ భజన మండలి సభ్యులు, పట్టణ ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సంగారెడ్డి రామ్‌మందిర్ గణపతి వద్ద కుటుంబ సభ్యులతో జగ్గారెడ్డి, రామ్‌మందిర్ భజన మండలి సభ్యులతో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



నందిగామ వద్ద ధ్వంసమైన బ్రిడ్జిని పరిశీలిస్తున్న మంత్రి దామోదర్

రామాయంపేట/నిజాంపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు నష్టపోయినవారిని ప్రభుత్వం ఆదుకుంటుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. రామాయంపేట, నిజాంపేట మండలాల్లో వర్ష ప్రభావిత ప్రాంతాల్లో గురువారం ఆయన మాజీ ఎమ్మెల్యే హన్మంతరావుతో కలిసి పర్యటించారు. వరదల దాటికి ధ్వంసమైన నందిగామ శివారులో సిద్దిపేట మార్గంలో కుంగిన ఎన్‌హెచ్ 765-డీజీ బ్రిడ్జిని పరిశీలించారు. రామాయంపేట పట్టణంలో వరద ప్రభావిత కాలనీల్లో పర్యటించారు. హాస్టల్‌లో చిక్కుకుని క్షేమంగా బయటపడిన విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలకు దెబ్బతిన్న ప్రజలను ఆదుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రెవెన్యూ, పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. ప్రమాదకరంగా ఉన్న చెరువులు, వాగుల వద్దకు వెళ్లవద్దని సూచించారు. ప్రమాదకరమైన గృహాలు, వరద ప్రభావిత కాలనీల నుంచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే ధ్వంసమైన రోడ్ల మరమ్మతులు ప్రారంభిస్తామని తెలిపారు. ఆయనవెంట వివిధ శాఖల మండల, జిల్లాస్థాయి అధికారులు, స్థానిక నాయకులు సుప్రభాత రావు, అమర్‌సేనారెడ్డి, ముత్యంరెడ్డి, వెంకటేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

మెతుకుసీమ.. గజగజ

రెండు రోజుల్లో 55 సెం.మీల వర్షం

- హవేళీఘన్‌పూర్‌లో ఇద్దరు మృతి
- పది మండలాలు జలమయం
- పలు మార్గాల్లో నిలిచిన రాకపోకలు
- పోచారం ప్రాజక్టు పైనుంచి నీటిప్రవాహం
- మంజీర, నక్కవాగు ఉగ్రరూపం

భారీ వర్షాలకు మెతుకుసీమ చిగురుటాకులా వణికిపోయింది. ఆకాశానికి చిల్లుపడిందా అన్నట్లు వాన కురియడంతో వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లాయి. వరద ప్రవాహాన్ని తట్టుకోలేక రహదారులు, వంతెనలు ధ్వంసమయ్యాయి. పది మండలాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. 130 గ్రామాల్లో కరెంటు, తాగునీరు కూడా లేక ప్రజలు విలవిలలాడారు. హవేళీఘనపూర్ మండలంలో పోచార ప్రాజెక్టు కట్ట పైనుంచి 8 అడుగులు వరద నీరు ప్రవహించడంతో క్షణక్షణం ఉత్కంఠ నెలకొంది. మండలంలో నక్కవాగు పొంగిపొర్లడంతో భోధన్-మెదక్ రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. రాజిపేట వద్ద వరదలో ఆటో కొట్టుకుపోవడంతో ఇద్దరు మృతిచెందారు. నాలుగు గంటలు విద్యుత్ స్తంభాన్ని పట్టుకొని వేలాడినా వారిని కాపాడలేకపోయారు. మెదక్ పట్టణ శివార్లలో పసుపేరు ఉధృతికి విద్యుత్ సబ్‌స్టేషన్ కొట్టుకుపోయింది. మంజీరా నది ఉధృతంగా ప్రవహించడంతో ఏడుపాయల ఆలయం నీట మునిగింది. ఎల్లాపూర్ వద్ద బ్రిడ్జి పైనుంచి మంజీరా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి.



రామాయంపేటలో వరద నీరు ముంచెత్తడంతో చెరువును తలపిస్తున్న ఓ కాలనీ

మరిన్ని ఫొటోలు, వార్తలు 8వ పేజీలో



గురువారం సాయంత్రం మెదక్‌కు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి వర్షాలు, వరదల ప్రభావంపై కలెక్టర్, అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం వరదల ప్రభావంపై ఫొటో ప్రదర్శనను పరిశీలించారు.

మెదక్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లావ్యాప్తంగా బుధ, గురువారాల్లో వరసగా రెండురోజుల పాటు కుంభవృష్టి కురిసింది. జిల్లాలో అత్యధికంగా హవేళీఘనపూర్ మండలంలో బుధవారం 16 సెం.మీ.లు, గురువారం 32 సెం.మీ.ల వర్షం కురిసింది. పెద్దశంకరంపేట మండలంలో బుధవారం 20 సెం.మీ., గురువారం 12 సెం.మీ., చేగుంటలో11 సెం.మీ., గురువారం 24 సెం.మీ., రామాయంపేటలో బుధవారం 17 సెం.మీ., గురువారం 21 సెం.మీ., మెదక్‌లో బుధవారం 13సెం.మీ., గురువారం 21 సెం.మీ వర్షపాతం నమోదయ్యింది. కొల్చారంలో 17 సెం.మీ., మాసాయిపేటలో 16సె.మీ., వెల్దుర్తిలో 14 సెం.మీ వర్షం గురువారం 14 సెం. మీ వర్షం కురిసింది. హవేళీఘనపూర్, మెదక్, రామాయంపేట, చేగుంట మండలాల్లో వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ ప్రకటించింది.

వర్ష బీభత్సానికి అపార నష్టం

జోరు వానలకు జిల్లావ్యాప్తంగా 130 గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం వాటిల్లింది. మెదక్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం కావడంతో సుమారు రూ.3.50 కోట్లు నష్టం వాటిల్లింది. 9 గ్రామాలు అంధకారమయమయ్యాయి. అనేక గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చిన్నశంకరంపేటలో పిడుగు పడడంతో ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయింది. హవేళీఘనపూర్ మండలంలో వందేళ్ల క్రితం నిర్మించిన పోచారం ప్రాజక్టుకు గండిపడుతుందని ప్రచారం జరగడంతో లోతట్టు గ్రామాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. మండలంలోని సర్దన గ్రామంలోకి నిజాంసాగర్ బ్యాక్‌వాటర్ చొచ్చుకువచ్చాయి. గ్రామానికి వెళ్లే రోడ్డు కొట్టుకుపోయింది. గ్రామస్థులను మెదక్‌కు తరలించి రెండు ఫంక్షన్‌హాళ్లలో పునరావాసం కల్పించారు. దూప్‌సింగ్ తండావాసులు నీటిలో చిక్కుకుపోయారు. తిమ్మాయిపల్లి గ్రామ చెరువుకు గండిపడడంతో ఊరంతా చుట్టేసింది. బ్రిడ్జి కొట్టుకుపోవడంతో ఊరికి వచ్చే దారులన్నీ మూసుకుపోయాయి. జిల్లావ్యాప్తంగా 33 రోడ్లు వరద నీటికి ధ్వంసమయి. 23 కల్వర్టులు తెగిపోయాయి. పది మండలాల్లో 6,800 ఎకరాల విస్తీర్ణంలో పంటలకు నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా. జిల్లాలోని 2,623 చెరువులు పూర్తిస్థాయిలో

మిగతా 8వ పేజీలో

హవేళీఘన్‌పూర్ మండలాన్ని ముంచెత్తిన వరద

హవేళీఘన్‌పూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలాన్ని వర్షాలు, వరదలు కుదిపేసాయి. పోచారం డ్యామ్ కొట్టుకుపోయే ప్రమాదం ఉందని అంచనా వేసిన అధికారులు సర్దన గ్రామస్థులను మెదక్‌కు తరలించి పునరావాసం కల్పించారు. రాజ్‌పేట తండాకు చెందిన మాలోత్ హరితకు పురిటినొప్పులు మొదలవగా బూర్గుపల్లి వద్ద బ్రిడ్జి కొట్టుకుపోవడంతో ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు. ముంపు ప్రాంతాలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే రోహిత్‌రావు సందర్శించి బాధితులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రాణాలు పోతుంటే పట్టించుకోరా



సత్యనారాయణ మృతదేహాన్ని పరిశీలిస్తున్న హరీశ్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, పద్మ, సుభాష్‌రెడ్డి

వరదలకు ప్రజల ప్రాణాలు పోతుంటే సీఎం రేవంత్‌రెడ్డి ఆటలు, మూసీ సందరీకరణపై రివ్యూలు చేయడమేమిటని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. రాజిపేటలో సత్యనారాయణ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

● చేగుంట: మండలంలోని బోనాల గ్రామంలో హరీశ్‌రావు రైతులతో మాట్లాడి పంటల పరిస్థితి, నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు.



తూప్రాన్‌లో నీట మునిగిన గాయత్రీనగర్ కాలనీ

ఉధృతంగా ప్రవహిస్తున్న హల్దీవాగు

తూప్రాన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలంలో హల్దీతో పాటు మిగిలిన వాగులు, వంకలు, చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. తూప్రాన్ పట్టణంలోని గాయత్రీనగర్‌కాలనీ మరోసారి జలమయమైంది. ఇళ్లలో ఐదడుగుల మేర నీరు చేరింది. హల్దీవాగు వంతెన మీదుగా ఆరడుగుల ఎత్తున ప్రవహిస్తుండటంతో కిష్టాపూర్, వెంకటాయపల్లి, నర్సంపల్లి, గౌడిగూడెం, గుండ్రెడ్డిపల్లి, మల్కాపూర్, కోనాయపల్లి (పీటీ), సిద్దిపేట జిల్లా బేగంపేట, అప్పాయపల్లి, ఎల్కంటి, ఇందుప్రియాల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షాలతో పొలాలు పెద్ద ఎత్తున నీట మునిగిపోయాయి. పొలాల్లోకి ఇసుక మేటలు పెట్టాయి.

జలదిగ్బంధంలో రామాయంపేట

రామాయంపేట/నిజాంపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రామాయంపేట పట్టణం జలదిగ్బంధంలో చిక్కుకుంది. కుంభవృష్టికి కుంటలు తెగిపోయి రోడ్లన్నీ చెరువులుగా మారాయి. కాలనీలు నీట మునిగాయి. మహిళా డిగ్రీ కళాశాల, ఎస్సీ బాలికల హాస్టల్‌లోకి వరద చేరడంతో 350 మంది విద్యార్థులను తరలించారు. రామాయంపేట-సిద్దిపేట రహదారిపై ఐదడుల మేర వరద ప్రవహించింది. నందిగామ వద్ద హైవే 765-డీజీ బ్రిడ్జి కుంగడంతో రాకపోకలు నిలిపేశారు. గజ్వేల్-పర్వతాపూర్ రోడ్డు కూడా తెగిపోయి రాకపోకలు నిలిచిపోయాయి. 1985, 1993లోనే ఇంత వర్షం పడిందని, అప్పట్లో కాలనీలు లేకపోవడంతో నష్టం జరగలేదని పలువురు పేర్కొన్నారు.



వరద ప్రవాహానికి కుంగిన రామాయంపేట-సిద్దిపేట రోడ్డు

వరదలు తగ్గాక బ్రిడ్జిల నిర్మాణం

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



నార్సింగ్ వద్ద కోతకు గురైన హైవే 44ను పరిశీలిస్తున్న ఎంపీ రఘునందన్

చేగుంట/నిజాంపేట/హవేళిఘణపూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వరదల ఉధృతి తగ్గిన వెంటనే హైవేలపై ధ్వంసమైన వంతెనల నిర్మాణాలను ప్రారంభిస్తామని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చేగుంట వద్ద కోతకు గురైన హైవే 44ను, నిజాంపేట మండలంలో దెబ్బతిన్న ఎన్‌హెచ్ 765-డీజీ రామాయంపేట-సిద్దిపేట రహదారిని పరిశీలించారు. హవేళిఘనపూర్ మండలం బూర్గుపల్లి రోడ్డు, రాజిపేట వాగును పరిశీలించారు. వర్ష ప్రభావం తగ్గిన వెంటనే హైవేల మరమ్మతుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పోలీస్, రెవెన్యూ అధికారులు ప్రయాణాకులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశం గౌడ్, తహసీల్దార్ గ్రేసీబాయి, ఎస్సై సృజన, వివిధ శాఖల అధికారులు, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు ఉన్నారు.

నారింజ ప్రాజెక్టును పరిశీలించిన ఎమ్మెల్యే

జహీరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు వర్షానికి నీటమునిగిన కాలనీలు, నారింజ ప్రాజెక్టును పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండ చూడాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో నివాసముండే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. మున్ముందు వరద ముంపు తల్తెకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వ్యవసాయశాఖ అధికారులు పంటల నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి పంపాలన్నారు.

సంగారెడ్డి జిల్లాలో భారీ వర్షం

కోతకు గురైన రోడ్లు.. నీట మునిగిన పంటలు

మళ్లీ తెరుచుకున్న సింగూరు, మంజీర గేట్లు

సంగారెడ్డి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రెండ్రోజులుగా కురిసిన వర్షానికి సంగారెడ్డి జిల్లా జలదరించింది. బుధ, గురువారాల్లో జిల్లా అంతటా మోస్తరు వర్షపాతం నమోదైంది. దీంతో ప్రధాన ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు, వాగులు జలకళను సంతరించుకున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు మంజీర నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ క్రమంలో సింగూరు, మంజీర ప్రాజెక్టుల గేట్లను మళ్లీ ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఇక వేలాది ఎకరాల్లో పత్తి, వరి, సోయా, ఇతర పంటలు నీట మునిగాయి. వరద తాకిడికి పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బి రహదారులు కోతకు గురయ్యాయి. ఎక్కడికక్కడ రాకపోకలు స్థంభించాయి. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టింది. ఇక కుండపోత వర్షానికి పలుచోట్ల పాత ఇండ్లు కుప్పకూలాయి. ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు.

పలు మార్గాల్లో నిలిచిన రాకపోకలు

నారాయణఖేడ్ శివారులోని మన్సూర్ వాగు పొంగిపొర్లడంతో కంగ్టి నుంచి సిర్గాపూర్‌తోపాటు కామారెడ్డి జిల్లా పిట్లంకు, కల్హేర్- పిట్లంతోపాటు తడ్కల్- బాన్సువాడ గ్రామాల మధ్య రాకపోకలు నిలిపివేశారు. రాయికోడ్ మండలం యూసుఫ్‌పూర్, కుసునూరు గ్రామాలకు వెళ్లే బ్రిడ్జిలపై వరద పొంగడంతో రాకపోకలు స్థంబించాయి. మునిపల్లి మండలం బొడ్‌శట్‌పల్లి, పుల్కల్ మండలం బొమ్మారెడ్డిగూడెం, వట్‌పల్లి మండలం గౌతాపూర్, సదాశివపేట మండలం కోనాపూర్- నాగులపల్లితోపాటు జిన్నారం- హైదరాబాద్‌కు వెళ్లే రహదారిపై అలుగు పారడంతో రాకపోకలు నిలిపివేశారు. నాగల్‌గిద్ద మండలంలోనూ పత్రుతండా, కిషన్‌నాయక్ తండా, సక్రుతండాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఝరాసంగం మండలం ప్యాలవరం, పోట్‌పల్లి, ఎల్గోయి గ్రామాలకు రాకపోకలను నిలిపివేశారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని బూచనెల్లి-గణపూర్, 65వ నంబర్ హైవే- రాయిపల్లి, గోపన్‌పల్లి- గోడిగార్‌పల్లి, అల్లీపూర్- అల్గోల్, పొట్టిపల్లి- అల్గోల్, జీర్లపల్లి- బోడగామ, రేజింతల్- ఎల్గోయి గ్రామాల మధ్య తీవ్ర అంతరాయం ఏర్పడింది.

మునిగిన పంటలు.. కూలిన ఇళ్లు

భారీ వర్షాలకు పలుచోట్ల పంటపొలాలు చెరువులను తలపించాయి. పత్తి, వరి, మొక్కజొన్న, సోయ ఇతర పంటలు నీట మునిగాయి. జిల్లావ్యాప్తంగా 10వేల ఎకరాలకు పైగానే పంటలు నీట మునిగినట్లు

మిగతా 8వ పేజీలో



నారాయణఖేడ్ శివార్లలోని మన్సూర్‌పూర్ వాగు పైనుంచి వరదనీరు ప్రవహిస్తుండడంతో నిలిచిపోయిన రాకపోకలు



కల్హేర్ మహాదేవ్‌పల్లిలో చెరువు నీటిని మళ్లిస్తున్న ఎస్ఐ



తల్లీకుమార్తె అదృశ్యం

పటాన్‌చెరు ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి తల్లీ, కుమార్తె అదృశ్యమయ్యారు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తెల్లాపూర్ మున్సిపల్ పరిధి ముత్తంగి గ్రామంలో రమేష్ భార్య సంగీత, రెండేళ్ల కుమార్తె నయనలతో ఉంటూ చెత్తబండి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 24న సాయంత్రం ఇంటికి వచ్చే సమయానికి భార్య, కుమార్తె కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో విచారించినా ఫలితం లేదు. భర్త రమేష్ ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.


సంగీత(ఫైల్)

పాఠశాలలను తనిఖీ చేయాలి : కలెక్టర్

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాఠశాలలను విధిగా తనిఖీ చేయాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో గురువారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాలలను తనిఖీలు చేయడమే కాకుండా ఆ వివరాలను స్కూల్ ఎడ్యుకేషన్ మొబైల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ముఖ గుర్తింపు హాజరులలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలని, పాఠశాలల్లో మౌలిక వసతులు కరెంట్, మరుగుదొడ్లు, తాగునీరు తదితర వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాలలో కొనసాగుతున్న ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీలో నిర్దేశించిన కార్యక్రమాలను సమయానుసారంగా పూర్తి చేయాలని సూచించారు. 59 పూర్వ ప్రాథమిక పాఠశాలల మంజూరును దృష్టిలో పెట్టుకుని అన్ని బడుల్లో ఆ విద్యార్థులకు అవసరమైన వాతావరణాన్ని కల్పించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మధ్యాహ్న భోజనంలో అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు గుడ్లు పంపిణీ చేసేలా ప్రధానోపాధ్యాయులు చూసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి నెల క్రమం తప్పకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి ప్రణాళిక రూపొందించి పాఠశాల పరిస్థితులు, విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు, వారి ప్రగతి ప్రదర్శన తెలపాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఈవో వెంకటేశ్వర్లు, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు బాలయ్య, వెంకటేశం, తాజుద్దీన్, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య



పనిచేయమంటే..ఆరోపణలు చేస్తున్నారు

● గజ్వేల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ

గజ్వేల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పారదర్శకంగా పనిచేయమంటే ఆరోపణలు చేస్తున్నారని గజ్వేల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో ఆర్ఎంవోలు రాము, ప్రతిమలతో కలసి ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. డిసెంబరులో డీసీహెచ్ఎస్‌గా చార్జ్ తీసుకున్నప్పటి నుంచి ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేసున్నానని, మాతా శిశు ఆసుపత్రిని ప్రారంభించినట్లు తెలిపారు. కొన్నాళ్లుగా గజ్వేల్ ఆసుపత్రిలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న వారిని వారి సొంత పోస్టింగ్‌లకు పంపిచామని, పనిచేయని వారిని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలగించామని తెలిపారు. డిప్యూటేషన్లు క్యాన్సిల్ చేయడం, తొలగించడం, పనిచేయమంటే తనపై వ్యక్తిగత కక్ష పెట్టుకుని ఇబ్బందులు పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. తనకు కులాన్ని ఆపాదిస్తున్నారని, ప్రతి శనివారం తాను ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయానికి, కమిషనర్ కార్యాలయానికి ఆసుపత్రి పనుల మీదే వెళ్తున్నామని తెలిపారు. రేడియాలజిస్టు విషయంలో కఠినంగా ఉంటామని, ప్రతి స్కానింగ్ ఆసుపత్రిలో జరిగేలా చూస్తామన్నారు. ప్రైవేట్‌కు రిఫరల్ చేసి తాను లబ్ధి పొందానన్న అంశం పూర్తిగా సత్యదూరమని తెలిపారు.


విలేకరులతో మాట్లాడుతున్న అన్నపూర్ణ

డీసీహెచ్ఎస్ పోస్టు నాకొద్దు !

● లిఖితపూర్వకంగా వద్దన్న డా.యాదగిరి

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని టీవీవీపీ జిల్లా ఆస్పత్రుల ఇన్‌చార్జి సమన్వయకర్తగా(డీసీహెచ్ఎస్) డా.ఎస్.యాదగిరి బాధ్యతలు స్వీకరించేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 26 వ తేదీన డా.సంగారెడ్డిని డీసీహెచ్ఎస్ బాధ్యతల నుంచి తప్పించి సదాశివపేట సీహెచ్‌సీలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న డా.ఎస్.యాదగిరిని నియమిస్తూ టీవీవీపీ కమీషనర్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే డా.యాదగిరి డీసీహెచ్ఎస్‌గా చేరేందుకు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. కాగా డీసీహెచ్ఎస్ పోస్టు కోసం మరో సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ డాక్టర్ తన ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఒకట్రెండు రోజుల్లో డీసీహెచ్ఎస్ ఎవరనేది స్పష్టత వచ్చే అవకాశముందని ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

అంగన్‌వాడీ టీచర్, ఆయా తొలగింపు

శివ్వంపేట, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రత్నాపూర్ అంగన్‌వాడీ సెంటర్‌లో ఇటీవల తాగునీటిలో ఎలుక పడిన ఘటనలో పలువురు చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. ఓ చిన్నారికి కడుపు ఉబ్బడంతో ఉన్నత అధికారులు చర్యలు తీసుకున్న ఘటన గురువారం రత్నాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఐసీడీఎస్ జిల్లా సంక్షేమ శాఖ అధికారి హైమావతి ఘటనకు బాధ్యులైన అంగన్‌వాడీ టీచర్ నవీన, ఆయా రాజమ్మను విధుల్లో నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు నర్సాపూర్ సీడీపీవో హేమ భార్గవి తెలిపారు.





ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడండి

●పంచాయతీ కార్యదర్శులకు డీపీవో ఆదేశం

మునిపల్లి, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసే బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని సంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని మొగ్దుంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని డీపీవో సందర్శించి రికార్డులు, గ్రామంలో పర్యటించి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ గ్రామాల్లో మురికి కాలువలు ఎప్పటికప్పుడు తీయించాలని, నీరు నిల్వకుండా చూడాలని కార్యదర్శులకు సూచించారు. అలాగే నర్సరీల్లోని మొక్కలను హరిత వనానికి సిద్ధంగా ఉంచాలన్నారు. ఈ విషయాల్లో కార్యదర్శులు నిర్లక్ష్యం చేయకుండా ప్రతి రోజు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలన్నారు. అంతకు ముందు అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంపీడీఓ డాక్టర్ హరినందన్ రావు, ఎంపీవో అండాలమ్మ, పంచాయతీ కార్యదర్శి నర్సింలు తదితరులు ఉన్నారు.

మంజీరా నదిలో మహిళ గల్లంతు

కొల్చారం, ఆగష్టు 28 (ఆంధ్రజ్యోతి): కొల్చారం కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన మహిళ మంజీరా నదిలో గల్లంతు అయిన సంఘటన మండలంలో తుక్కాపూర్ గ్రామంలో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన టేక్మాల్ మల్లప్ప భార్య టేక్మాల్ ప్రమీల బయటకు వెళ్లొస్తానంటూ ఇంటి నుంచి వెళ్లింది. మధ్యాహ్నమైనా ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల వాళ్లను, బంధువులను అడిగినా ప్రమీల ఆచూకీ లభించలేదు. బుధవారం మంజీరా నది బ్రిడ్జి ఎడమవైపు ఒడ్డు పైన ప్రమీల వేసుకున్న చెప్పులు, నడుముకు నొప్పి కోసం వేసుకున్న బెల్టు కనిపించాయి. సింగూర్ నుంచి దిగువకు నీటిని వదలడంతో ఆప్రవాహంలో కొట్టుకుపోవచ్చు అన్న అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై హైమద్ మొహినొద్దీన్, తహసీల్దార్ శ్రీనివాస్ చారి ఎస్డీఆర్ బృందాలను రప్పించి ప్రమీల ఆచూకీ కోసం నదిలో వెతికించారు.


ప్రమీల (ఫైల్)

భార్యపై అలిగి భర్త అదృశ్యం

పటాన్‌చెరు ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కుటుంబసమస్యల నేపథ్యంలో భార్యాభర్తలు గొడవ పడి భర్త అదృశ్యం అయ్యాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇంద్రేశం మున్సిపల్ పరిధి రామేశ్వరంబండ గ్రామంలో నివాసం ఉంటున్న సాయిలు మంగళవారం ఉదయం భార్య స్వప్నతో గొడవ పడాడు. ఇద్దరూ కూలిపనికి వెళ్లి వచ్చిన తర్వాత సాయంత్రం భర్త బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల విచారించినా ఫలితం లేదు. భార్య స్వప్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.


సాయిలు(ఫైల్)

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య

●అనాథలైన ముగ్గురు కుమార్తెలు

మనోహరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గతంలో భర్త మరణించడంతో ముగ్గురు కూతుర్ల పోషణ భారమై చెరువులో దూకి ఓ ఇల్లాలు ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండల పరిధిలో జరిగింది. ఎస్సై సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం రంగాయపల్లి గ్రామానికి చెందిన జంగం నగేష్ రజితలకు ముగ్గురు కుమార్తెలు. రెండేళ్ల క్రితం నగేష్ గుండెపోటుతో మరణించారు. అప్పటి నుంచి కుమార్తెల పోషణ, రోజు రోజుకి తల్లి జంగం రజితకు భారం కావడంతో, కుటుంబ ఆర్థిక ఇబ్బందుల వల్ల బుధవారం గ్రామంలోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. దీంతో కుటుంబీకులు ఎక్కడ వెతికినా ఆచూకి లభించలేదు. బుధవారం రాత్రి పోలీసులకు మామ జంగం నర్సింలు ఫిర్యాదు చేశాడు. దీంతో ఉదయం అటుగా వెళ్తున్న గ్రామస్థులు చూసే సరికి చెరువులో నీటిపై తెలుతూ కనిపించింది. దీంతో వెంటనే గ్రామస్థులు ఒడ్డుకు చేర్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.


జంగం రజిత(ఫైల్)

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

జహీరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన సంగారెడ్డిజిల్లా జహీరాబాద్ మండలంలోని హుగ్గెల్లి గ్రామశివారులో 65వ నెంబర్ జాతీయరహదారిపై చోటు చేసుకుంది. జహీరాబాద్ రూరల్ ఎస్సై కాశీనాథ్ కథనం ప్రకారం.. ఈ నెల 27 రాత్రి గుర్తుతెలియని వ్యక్తిని ఓ వాహనం ఢీకొనడంతో బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్థానికుల ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అన్నారు. మృతుడికి సంబంధించిన వారెవరైనా ఉంటే 8712661847, 8712656764, 8712656731 లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

గుర్తుతెలియని మహిళ..

పటాన్‌చెరు ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్న గుర్తుతెలియని మహిళను పోలీసులు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్సపొందుతూ మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. 60 ఏళ్ల గుర్తుతెలియని మహిళ పటాన్‌చెరు యాక్సిస్ బ్యాంకు వద్ద పడి ఉండగా బుధవారం స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆసుపత్రిలో చేర్పించారు. ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు

అప్పులబాధతో టెక్నీషియన్ ఆత్మహత్య

పటాన్‌చెరు ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ప్రైవేట్ పరిశ్రమలో పని చేస్తున్న టెక్నీషియన్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తెల్లాపూర్ పురపాలక పరిధి ముత్తంగి గ్రామం సాయిప్రియకాలనీలో నివాసం ఉంటున్న జాకబ్(43) రుద్రారం గ్రామం తోషిబా పరిశ్రమలో టెక్నీషియన్‌గా పని చేస్తున్నారు. ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడంతో అప్పులు చేశాడు. వాటిని తీర్చలేక 15రోజులుగా డ్యూటీకి వెళ్లకుండా ఇంటివద్దే ఉండిపోయాడు. బయటకు వెళ్లిన సాయిలు తిరిగి రాలేదు. చిట్కుల్ మల్లన్న గుడి వెనుక వేపచెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ

●డ్రైవర్ మృతి

ములుగు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఘటనలో లారీ డ్రైవర్ మృతి చెందిన సంఘటన గురువారం ఉదయం ములుగు సమీపంలోని హవేలీ ఫామ్స్ వద్ద చోటుచేసుకుంది. ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజీవ్ రహదారిపై ప్రజ్ఞాపూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ బ్రేక్‌డౌన్ కావడంతో హవేలి ఫామ్స్ వద్ద ఆపాడు. గురువారం తెల్లవారుజామున ప్రజ్ఞాపూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ ఆగి ఉన్న లారిని ఢీకొట్టగా డ్రైవర్ శివకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.








ఘనపురం ఆనకట్ట నుంచి ఉప్పొంగిన మంజీర


భూంపల్లిలో ఉధృతంగా ప్రవహిస్తున్న కూడవెల్లి వాగు


మాసాయిపేట మండలం ఉప్పులింగాపూర్‌లో బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న హల్దీవాగు

ఉప్పొంగిన వరద


పాపన్నపేట మండలంలోని ఎల్లాపూర్ వంతెనపై నుంచి పారుతున్న మంజీర


ఏడుపాయలలో

ఉమ్మడి మెదక్ జిల్లాలో రెండురోజులుగా కురిసిన కుండపోత వర్షాలతో వరద నీరు హోరెత్తింది. వాగులు పొంగిపొర్లుతుండగా, చెరువులు అలుగులు దూకుతున్నాయి. కుంటలు, ఒర్రెలతో సహా ఎటుచూసిన జలసవ్వడి కనిపిస్తున్నది. హల్దీ వాగు ఉగ్రరూపం దాల్చగా, మంజీర నది ఉప్పొంగింది. కూడవెల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది.

\- న్యూస్ నెట్‌వర్క్


సిర్గాపూర్ మండలంలోని నల్లవాగు ప్రాజెక్టు అలుగుపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరద


కోహెడ మండలం బస్వాపూర్ గ్రామం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మోయ తుమ్మెద వాగు


చేర్యాల మండలం తాడూరులో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు


సిద్దిపేట తిప్పారబోయిన కాలనీ నుంచి బూరుగుపల్లికి వచ్చే రోడ్డుపై ప్రవహిస్తున్న చెరువు నీరు


సిద్దిపేట కోమటిచెరువు పరవళ్లు




జహీరాబాద్ పరిధిలోని నారింజ ప్రాజెక్టు నుంచి దిగువకు పారుతున్న నీరు, మత్తడిపోస్తున్న బెజ్జంకి మండలం తోటపల్లి వరదకాలువ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్


తొగుట మండలం చందాపూర్ గ్రామ శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

విద్యుత్ అమరుల స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహిస్తాం

● సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చుక్క రాములు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ అమరుల స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చుక్క రాములు అన్నారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో సీపీఎం నాయకులు విద్యుత్ అమరులు విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి, రామకృష్ణల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 28 అప్పటి ప్రభుత్వం బషీర్‌బాగ్ వద్ద ముగ్గురు అమరులను కాల్చి చంపిందని, దీనిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు పిలుపునిస్తే ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేశారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలు నిర్వహించి గుణపాఠం చెబుతామని చుక్క రాములు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మాణిక్యం, నర్సింలు, యాదగిరి, కృష్ణ, అశోక్, రాజయ్య, శివకుమార్, బాల్‌రాజ్, విఠల్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర్‌పల్లి గ్రామంలో జపాన్ బృందం పర్యటన


ఉత్తర్‌పల్లిలో జపాన్ బృంద సభ్యులు

కంది, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): గ్రామీణ జీవన విధానం, గ్రామాల స్థితిగతులను తెలుసుకునేందుకు జపాన్ దేశానికి చెందిన సుజుకి సంస్థ బృంద సభ్యులు 30 మంది సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఉత్తర్‌పల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మురికి కాలువలు, రోడ్లు, పాఠశాల భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. జిల్లా కేంద్రానికి పక్కనే ఉన్నప్పటికీ గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడం, ఆరోగ్య ఉపకేంద్రం అందుబాటులో లేకపోవడంతో గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులను వారు తెలుసుకున్నారు. ఇక్కడి జనాభా, ఏఏ పంటలు వేస్తారనే విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఉత్తర్‌పల్లి అభివృద్ధి కోసం తమ ఇన్నోవేషన్ సంస్థ ద్వారా సహాయం చేస్తామని పేర్కొన్నారు.

వర్షంలో సైతం.. యూరియా కోసం

రైతులకు తప్పని తిప్పలు


కొండపాకలో వర్షంలోనూ యూరియా కోసం బారులు తీరిన రైతులు


దుబ్బాకలో యూరియా కోసం వానలో రైతుల ఆందోళన

దుబ్బాక/మిరుదొడ్డి/నంగునూరు/కొండపాక/తొగుట/రాయపోలు/మనోహరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వర్షం దంచికొడుతున్నా ఒక్క బస్తా ఎరువు దక్కించుకునేందుకు రైతులకు బాధలు తప్పలేదు. సిద్దిపేట జిల్లాలో వినాయకచవితి రోజూ రైతులు ప్యాక్స్ కేంద్రాల వద్ద, ఫర్టిలైజర్ దుకాణాల ఎదుట బారులు తీరారు. దుబ్బాక వ్యవసాయ సహకార సంఘం వద్ద తెల్లవారుజాము నుంచే వరుస కట్టారు. పండుగైనా చిన్నపిల్లలు, వృద్ధులను సైతం తీసుకొచ్చి క్యూలో నిలబెట్టినా ఫలితం లేకుండా పోయింది. దాదాపు రెండు వేల మంది వరకు దుబ్బాక ఏఎంసీ వద్దకు చేరుకున్నారు. సుమారు 542 బస్తాలను పంపిణీ చేయగా, 275 మందికే అందాయి. వర్షంలోనూ ఇంటిల్లిపాది వచ్చి యూరియా కోసం పడిగాపులు కాచినా దొరకకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చేసేదేమీ లేక తిరిగివెళ్లిపోయి, గురువారం తెల్లవారుజామున యూరియా కోసం తిరిగి వ్యవసాయ సహకార సంఘం వద్దకు చేరారు. తీరా పంపిణీ చేయకపోవడంతో రైతులు శివాజీ చౌరస్తా వద్దకు చేరుకుని రాస్తారోకో నిర్వహించారు. దుబ్బాక ఎస్‌ఐ కీర్తిరాజు వారిని సముదాయించారు. మిరుదొడ్డి రైతువేదిక వద్ద యూరియా టోకెన్ల కోసం రైతులు బారుల తీరారు. తోపులాటలు జరగకుండా పోలీసుల సమక్షంలో అందజేయాల్సి వచ్చింది. నంగునూరు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్ద తెల్లవారకముందు నుంచే రైతులు బారులు తీరారు. 500 బస్తాలే ఉండగా, వచ్చినంత వరకు సరఫరా చేస్తామని అధికారులు రైతులకు వివరించే ప్రయత్నం చేశారు. యూరియా ఇచ్చేంతవరకు కదిలేది లేదంటూ వ్యవసాయ శాఖ అధికారులను రైతులు అడ్డుకున్నారు. సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను అక్కడికి చేరుకుని రైతులకు సర్దిచెప్పారు. వర్షం పడుతున్నా తొగుటలోని ఆగ్రోస్ కేంద్రం వద్దకు గురువారం పెద్దసంఖ్యలో రైతులు చేరుకున్నారు. 560 బస్తాలే ఉండగా, పోలీస్ పహారా మధ్య ఒక్కో రైతుకు రెండు బస్తాల యూరియాను పంపిణీ చేశారు. కొండపాక పీఏసీఎస్‌కు గురువారం యూరియా లోడ్ రాగా, విషయం తెలిసి వర్షంలో సైతం రైతులు అక్కడికి ఎక్కువ సంఖ్యలో చేరుకున్నారు. టోకెన్ల వారీగా రైతులకు యూరియా పంపిణీ చేయగా, సగంమందికి దక్కలేదు. రాయపోల్‌లోని ఆగ్రోస్ కేంద్రానికి 550 బస్తాల యూరియా లోడ్ రాగా, వానలో గంటల తరబడి వేచిఉన్న రైతులకు ఒక్కొక్కరికీ ఒక బస్తా పంపిణీ చేశారు. మెదక్ జిల్లా మనోహరాబాద్‌లోని రైతువేదిక వద్ద రైతులకు టోకెన్లను అందజేశారు. అక్కడి నుంచి మనోహరాబాద్ చౌరాస్తాకు వర్షంలోనే వెళ్లి యూరియా తీసుకునేందుకు బారులు తీరారు. అయితే, టోకెన్ల ఇచ్చిన అందరికీ యూరియా అందలేదు. టోకెన్ తీసుకుని ఉదయం నుంచి ఎరువు బస్తా కోసం ఎదురుచూస్తే అధికారులు స్టాక్ అయిపోయిందని చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.


రాయపోల్‌లో..

నంగునూరులో ఎగబడుతున్న రైతులు



జాతీయస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలకు కొండపాక విద్యార్థి ఎంపిక

కొండపాక, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : కొండపాక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి పొడిమ్యాకల కిరణ్‌కుమార్‌యాదవ్ జాతీయస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జరిగే పోటీల్లో కిరణ్ కుమార్ పాల్గొంటాడని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విఠల్‌నాయక్ తెలిపారు. గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు దొమ్మాట జానకిరామ్‌రెడ్డి కిరణ్‌కుమార్‌కు రూ.పదివేల ఆర్థికసాయం అందించారని పేర్కొన్నారు.

జాతీయస్థాయి లేఖ రచన పోటీల్లో సిద్దిపేట విద్యార్థిని విజయం

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఎస్సీ మూడో సంవత్సరం విద్యార్థిని తిప్పనబోయిన రిబ్కా జాతీయస్థాయి లేఖ రచన పోటీలో విజేతగా నిలిచింది. వ్యవహారిక భాష ఉద్యమకారుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లిగూడెం డీఆర్జీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. 'యువతపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై లేఖ రాసిన రిబ్కా ఉత్తమ లేఖ బహుమతి గెలుచుకుందని కళాశాల తెలుగు విభాగం అధ్యక్షుడు డాక్టర్ మట్టా సంపత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు సిద్దిపేట జిల్లా క్రీడాకారుల ఎంపిక

గజ్వేల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువ తెలంగాణ కబడ్డీ చాంపియన్‌షిప్ లీగ్ పోటీలకు సిద్దిపేట జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి శివకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిష్ఠాత్మక పోటీల్లో జిల్లాకు చెందిన వంశీకృష్ణ(రైట్ కార్నర్), సాయికుమార్ (లెఫ్ట్ కార్నర్) ఎంపికయ్యారని, భవిష్యత్తులో ప్రో కబడ్డీ పోటీల్లో సిద్దిపేట జిల్లా నుంచి క్రీడాకారులు పాల్గొనేలా శిక్షణ ఇస్తామని తెలిపారు.

డీసీఎం వాహనమే మండపం

వ్యాన్‌లో కొలువుదీరిన గణనాథుడు

గణేష్ చతుర్థికి వీధిలో స్టేజీ వేసి, పందిరి వేసి, అలంకరణ చేసి మండపాన్ని తీర్చిదిద్ది వినాయకుడిని ప్రతిష్ఠిస్తుంటాం.. కానీ, వర్షాల నేపథ్యంలో నర్సాపూర్ పట్టణంలోని భక్తులు మాత్రం వినూత్నంగా ఆలోచించారు. వాహనంలోనే గణనాథుడిని కొలువుదీర్చారు. వర్షానికి తడవకుండా, డీసీఎం వ్యాన్‌నే మండపంగా తీర్చిదిద్ది, విఘ్నేశ్వరుడిని ప్రతిష్ఠించి పూజలు చేయడం అందరినీ ఆకట్టుకుంటుంది. పట్టణంలో గాంధీ విగ్రహం వద్ద యాదవ సంఘం ఆధ్వర్యంలో వినాయకుడిని ప్రతీ ఏటా



ప్రతిష్ఠిస్తున్నారు. రెండురోజులుగా ఎడతెరపి లేని వర్షాలతో మండపం పనులు చేయడం కష్టంగా మారడంతో ఇలా డీసీఎం వాహనాన్నే మండపంగా మార్చి అందులోనే గణనాథుడని ఏర్పాటు చేశారు.

\- నర్సాపూర్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి)






కోహీర్ : పోతిరెడ్డిపల్లి మార్గమధ్యలో ఉన్న నారింజ వాగు వరద ఉధృతికి కొట్టుకుపోయిన సోయా, మొక్కజొన్న పంట పొలాలు, కొల్చారం మండలం కిష్టాపూర్ వద్ద పంట పొలాల నుంచి పారుతున్న వరద నీరు

ఎటు చూసినా నీళ్లే..

దంచికొట్టిన వాన

- నీట మునిగిన పంటలు
- కొట్టుకుపోయిన రోడ్లు, దెబ్బతిన్న ఇళ్లు
- సహాయ చర్యల్లో అధికారులు

రెండురోజులుగా కురిసిన వర్షం అపార నష్టాన్ని మిగిల్చింది. బుధవారం నుంచి కురిసిన వర్షానికి పలు గ్రామాల్లోని పంటలన్నీ నీట మునిగాయి. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించాయి. వర్షపునీటికి రోడ్లన్నీ దెబ్బతిని కొట్టుకుపోయాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలు గ్రామాల్లో ఇళ్లు కూలాయి. నీట మునిగిన పంటలను అధికారులు పరిశీలిస్తున్నారు.

కోహీర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బిలాల్‌పూర్, పైడిగుమ్మల్, కోహీర్, రాజనెల్లి, దిగ్వాల్, మద్రి గ్రామాల పరిధిలో నుంచి ప్రవహించే నారింజ వాగు పరీవాహక ప్రాంతాల్లోని పంట పొలాలన్నీ నీట మునిగాయి.

●**కంగ్టి:** మండలంలోని పలు గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. జంగి.కె, జంగి.బి, గ్రామాల మధ్య కాకివాగు వంతెన పైనుంచి పారుతుండడంతో జంగి, తడ్కల్ మధ్య రాసోల్, తడ్కల్ మధ్య, వాస్నువాడ.డి, తడ్కల్ గ్రామాల మధ్య బీంరా, కంగ్టిలకు రాకపోకలు నిలిపివేశారు.

●**నాగల్‌గిద్ద:** మండల పరిధిలోని సరిహద్దు గ్రామాలైన గౌడ్‌గాంజన్‌వాడ శివారులో మంజీరా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. పలు చోట్ల రోడ్లపై నీరు పారుతోంది.

●**మనూరు:** వర్షానికి మనూరు ఎంపీడీవో కార్యాలయం పై కప్పు కురవడంతో కంప్యూటర్లు, ఫైళ్లు తడిసి ముద్దయ్యాయి.

●**నర్సాపూర్:** మండలంలోని మహ్మదాబాద్ పెద్దచెరువుకు బుంగ పడగా, జీపీ కార్మికులు ఇసుక బస్తాలతో గండి పూడ్చారు. ఆరు గ్రామాల్లో ఆరు ఇళ్లు స్వల్పంగా దెబ్బతిన్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ పేర్కొన్నారు.

●**జిన్నారం:** మండలంలోని మంత్రికుంట చెరువుకు చిన్నపాటి బుంగ పడింది.

●**పెద్దశంకరంపేట:** భారీ వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాలను గురువారం సాయంత్రం నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పరిశీలించారు. డివిజన్ పరిధిలోని పలు గ్రామాలను ఏడీఏ సందర్శించారు.

●**నారాయణఖేడ్:** మండలంలోని వెంకటాపూర్ శివారులో నీట మునిగిన పంట పొలాలను మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి గురువారం సందర్శించారు. బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

●**రేగోడ్:** రేగోడ్ మండలంలోని పలు గ్రామాల్లో నీట మునిగిన పంటలను అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పరిశీలించారు.

పలు చోట్ల కూలిన ఇళ్లు

కోహీర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రుక్సానాబేగంకు చెందిన ఇల్లు, మండలంలోని పీచేర్యాగడి పాతతండాలో చౌహన్‌మాణిక్‌కు చెందిన ఇంటి వెనుక వైపు గోడ కూలిపోయింది.

●**మనోహరాబాద్:** మండల కేంద్రంలోని కాళ్లకల్ గ్రామంలో గురువారం రెండు పెంకుటిళ్లు కూలిపోయాయి.

●**చిలప్‌చెడ్:** మండలంలోని చండూరు, ఫైజాబాద్, జగ్గంపేట గ్రామాల్లో ఇళ్లు కూలిపోయాయి.

●**మనూరు:** మండల పరిధిలోని తుమ్నూరు గ్రామంలో బాలమ్మ, యాదమ్మ, సత్యమ్మకు చెందిన మూడు ఇళ్లు కూలిపోయాయి.

●మాసాయిపేట: మండలంలోని బొమ్మారం, అచ్చంపేట, హకీంపేట, నాగసానిపల్లి, పోతనపల్లి గ్రామాల్లో పెంకుటిళ్లు కూలిపోయాయి.

●**సదాశివ పేట :** ఆత్మకూర్ గ్రామంలో మల్లేశ్వరికి చెందిన ఇళ్లు, వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతు నాగుపల్లి శ్రీనివాస్ ఇల్లు సగభాగం కుప్ప కూలిపోయింది.

●**నారాయణఖేడ్:** పట్టణంలోశిథిల గృహాలను ఎక్సకవేటర్ సహయాంతో కూల్చేయించారు.

●**వెల్దుర్తి :** మండలంలోని హల్దీవాగుపై ఉన్న చెక్‌డ్యాంలు, గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటల్లోకి నీరు చేరి అలుగుపారుతున్నాయి.

●**చిన్నశంకరంపేట:** మండలవ్యాప్తంగా ఉన్న 185 చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లు నిండుకుండలా మారి అలుగుపారుతున్నాయి.

●**అల్లాదుర్గం :** మండలంలోపి కాయిదంపల్లి శివారులోని కుమ్మరికుంటకు గడిపడటంతో ఈ నీటి ప్రవాహానికి సమీపంలోని పంట పొలాలు నీట మునిగాయి.ముప్పారం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ప్రహరీ నీటి ప్రవాహానికి కూలిపోయింది. చిల్వర్ గ్రామంలో నిమ్మలగారి యాదమ్మ ఇల్లు కూలిపోయింది. మండలంలోని సీతానగర్ గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకున్నది.

●**కొల్చారం:** కొల్చారం మండలంలోని ఘనపూర్ ఆనకట్ట పైనుంచి వరదనీరు దిగువ ప్రాంతానికి భారీగా వెళ్తోంది.

●**నర్సాపూర్:** మండలంలోని రెడ్డిపల్లి-మంతూరు గ్రామాల మధ్య కాళేశ్వరం కాలువ పక్కన ఉన్న ఖాజీపేటతండాకు వెళ్లే దారిలో రోడ్డు కుంగిపోయింది.

●**రేగోడు :** మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రైతు జంగ కుమార్ వ్యవసాయ పనుల కోసం పొలానికి వెళ్లి వాగులో చిక్కుకున్నాడు. గమనించిన స్థానికులు ఓ తాడు సహాయంతో కాపాడారు.

●**చేగుంట :** నార్సింగ్ మండలం నర్సంపల్లితండాలోని గురుమోనీ కుంట కట్టు కాలువ గండిపడడంతో నార్సింగి 44వ జాతీయ రహదారి జలదిగ్బంధమైంది. ఓ కోళ్ల ఫారంలోకి నీరు చేరడంతో కోడి పిల్లలు మృతిచెందాయి.

మెతుకుసీమ.. గజగజ

(5వ పేజీ తరువాయి)

నిండాయని, 53 చెరువుల కట్టలు ధ్వంసమయ్యాయని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. రామాయంపేటలో హాస్టల్‌ను నీరు చుట్టుముట్టడంతో 345 మంది విద్యార్థులన రెస్క్యూ టీమ్ సభ్యులు కాపాడారు. బీసీ కాలనీ నీట మునిగింది. మెదక్ పట్టణంలో ఎంఎన్‌కెనాల్‌లో వ్యర్థాలు పేరుకుపోవడంతో పక్కనే ఉన్న సాయినగర్‌కాలనీలోకి వరద నీరు ప్రవేశించింది. ఎమ్మెల్యే రోహిత్‌రావు సహాయక చర్యలు చేపట్టారు. వర్షం ధాటికి నిజాంపేటలో కోళ్ల ఫారం ధ్వంసమై 10వేల కోళ్లు మృతిచెందాయి. చేగుంట, మెదక్, హవేళీ ఘనపూర్, మాసాయిపేట, వెల్దుర్తి, తూప్రాన్, పాపన్నపేట, చిన్నశంకరంపేట మండలాల్లో అనేక ఇళ్లు నేలకూలాయి.

సంగారెడ్డి జిల్లాలో భారీ వర్షం

(5వ పేజీ తరువాయి)

అంచనా. ప్రస్తుతం వర్షాలు తగ్గకపోవడంతో నష్టాన్ని పూర్తిగా అంచనా వేయలేకపోతున్నారు. ఇప్పటికీ వరద ప్రవాహం కొనసాగుతున్నందున నష్టం పెరిగే అవకాశం ఉంది. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో నివేదిక సిద్ధం చేస్తున్నారు. ఇక శిథిలావస్థకు చేరిన దాదాపు 300 పైచిలుకు ఇండ్లు నేలమట్టమైనట్లుగా తెలుస్తోంది.

● జహీరాబాద్: జహీరాబాద్ ప్రాంతంలోని నారింజ ప్రాజెక్టుకు 6,900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదుతోంది. రెండు గేట్లు ఎత్తి 6,750 క్యూసెక్కులు బయటకు వదులుతుని అధికారులు తెలిపారు.

● కల్హేర్: సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1,493 అడుగులు కాగా.. 1495 అడుగులకు చేరుకుంది. ప్రాజెక్టు ఇన్‌ఫ్లోగా 15 వేయిల క్యూసెక్కులు రాగా అంతేస్థాయిలో అలుగుపై నుంచి దిగువన ఉన్న మంజీరా నదిలోకి చేరుతోంది.

● జిన్నారం: మూడు రోజులుగా కురుస్తున్న వర్షలతో మండల కేంద్రంలోని పీహెచ్‌సీ భవనంలో పలుచోట్ల స్లాబు పెచ్చులు ఊడిపడ్డాయి. నూతన భవనం నిర్మించినా ప్రారంభించకపోవడంతో సిబ్బంది, రోగులు బిక్కుబిక్కుమంటున్నారు.

● అమీన్‌పూర్: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని నారాయణరెడ్డి కాలనీ, వీరారెడ్డికాలనీ, భవానీపురంకాలనీ, శుభంకాలనీలు జలమయ్యాయి.



వెల్దుర్తి : ఉప్పులింగాపూర్ హల్దీవాగు బ్రిడ్జిపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు



చిన్నశంకరంపేట : చందంపేట-రుద్రారం కల్వర్టుపై ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు



జహీరాబాద్ పట్టణంలోని నీట మునిగిన డ్రీమ్‌వెల్లి కాలనీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు తదితరులు



పెద్దశంకరంపేట మండల పరిధిలోని దానంపల్లి శివారులో రహదారి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

న్యూస్ బాక్స్

కలెక్టరేట్‌లో మొదలైన మరమ్మతులు



కొనసాగుతున్న మరమ్మతు పనులు

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. జూలై 28 'ఆంధ్రజ్యోతి'లో 'కంపు కొడుతున్న కలెక్టరేట్ అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ ప్రావీణ్య స్పందించారు. వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని సంబంధితశాఖ అధికారులను ఆదేశించారు. దీంతో కలెక్టరేట్‌లోని మూత్రశాలలు, లీకవుతున్న ఆయా శాఖల కార్యాలయాలకు మరమ్మతులు చేపట్టారు. ఊడిపోయిన పాల్‌సీలింగ్, తుప్పు పట్టిన ఫర్నిచర్‌ను తొలగించి కొత్త వాటిని సమకూరుస్తున్నారు.

కాంట్రాక్టు కార్మికుల కోసం కలెక్టరేట్ దిగ్బంధం

హత్నూర, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమలలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాల పెంపు కోసం ఈ నెల 29న నిర్వహించే కలెక్టరేట్ దిగ్బంధాన్ని జయప్రదం చేసేందుకు పెద్దఎత్తున కార్మికులు తరలిరావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు పిలుపునిచ్చారు. గురువారం హత్నూర మండలంలోని పలు పరిశ్రమల వద్ద కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో పాల్గొన్న సాయిలు, సహాయ కార్యదర్శి యాదగిరి మాట్లాడారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్తను కాల్చొద్దు

ఐడీఏబొల్లారం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : బహిరంగంగా వ్యర్థాలను కాల్చడం నిషేధించామని మున్సిపల్ కమిషనర్ కిషన్ అన్నారు. గురువారం ఐడీఏబొల్లారం మున్సిపల్ పరిధి ప్రవేటు ఫంక్షన్‌హాల్‌లో కాలనీ, బస్తీవాసులతో అవగాహన సమావేశం నిర్వహించి మాట్లాడారు.

జిన్నారం మున్సిపల్ కమిషనర్‌గా తిరుపతి

జిన్నారం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం మున్సిపాలిటీ కమిషనర్‌గా తిరుపతి బాధ్యతలు స్వీకరించారు. గురువారం జిన్నారం పంచాయతీ కార్యాలయ భవనంలో నూతన మున్సిపాలిటీ కమిషనర్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు.

భారీ వర్షాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి



సంగారెడ్డిలోని మాసాని కుంట, కలబ్‌గూర్‌లో గండిపడిన కుంటను పరిశీలిస్తున్న ప్రావీణ్య



ఖేడ్ మండలం మాద్వార్ వద్ద ప్రమాదకరంగా మారిన వంతెనను పరిశీలిస్తున్న ఎస్పీ పంకజ్

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. రెండురోజులుగా భారీగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో సంగారెడ్డి పట్టణ పరిధిలోని రేణిగుంట, ఎర్రగుంట, మాసాను కుంట, మండలంలోని కలబ్‌గూర్ గ్రామంలో గల కుంటలను ఆమె పరిశీలించి మాట్లాడారు. జిల్లాలోని చెరువులు, కుంటలు, వాగులకు పడిన గండ్లను పరిశీలించి, మరమ్మతులు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నంబర్ 08455-276155 ఏర్పాటు చేశామని తెలిపారు. ఆమె వెంట కలెక్టర్ వెంట ఆర్డీవో రవీందర్ రెడ్డి, సంగారెడ్డి తహసీల్దార్ జయరామ్‌నాయక్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ ప్రవీణ్ రెడ్డి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. గురువారం సంగారెడ్డి పట్టణంలోని మహబూబ్‌సాగర్ చెర్వు, సదాశివపేట ఊబచెరువులను సందర్శించారు. చెరువుల వద్ద నీటి మట్టాన్ని పరిశీలించారు. పొంగిపొర్లే వాగులను చూడటానికి, దాటడానికి ఎవ్వరూ రాకుండా ప్రమాద సూచిక బోర్డు లను ఏర్పాటు చేయించాలని సూచించారు. అలాగే శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో ఉండొద్దని సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ సత్తయ్యగౌడ్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, పట్టణ సీఐ రమేష్, సదాశివపేట సీఐ వెంకటేశం ఉన్నారు. నారాయణఖేడ్ మండలం ఖాంజీపూర్, మాద్వార్ వంతెనలతో పాటు నిజాంపేట మండలం శాకాపూర్ వద్ద ప్రమాదకర వంతెనలను డీఎస్పీ వెంకట్‌రెడ్డితో కలిసి ఎస్పీ పంజక్ పరిశీలించారు. సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి, తదితరులు ఉన్నారు. సదాశివపేట పట్టణంలో 65వ జాతీయ రహదారి పక్కనే ఉన్న భారీ నీటి వనరు (ఊబచెరువును) గురువారం ఎస్పీ పరితోష్ పంకజ్ తహసీల్దార్ కే.సరస్వతి, మున్సిపల్ కమిషనర్ టీ.శివాజీతో కలిసి పరిశీలించారు. ఎస్పీ వెంట మున్సిపల్ టీపీవో భాస్కర్‌గౌడ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ తదితరులు ఉన్నారు.

పంట నష్టపోయిన రైతులకు రూ.లక్ష పరిహారం చెల్లించాలి

- ఆశ్రయం పొందుతున్న ప్రజలను ఆదుకోవాలి
- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏపాల్



పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న ప్రజలకు భోజన ప్యాకెట్లు అందజేస్తున్న కేఏపాల్

మెదక్ అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను రూ.లక్ష పరిహారం చెల్లించాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏపాల్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. మెదక్ పట్టణంలోని పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న ప్రజలు పరామర్శించారు. వారికి భోజన ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు రాజకీయ పార్టీలపై నమ్మకం పోయిందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అధికారం చేపట్టాయని, ఇంకా ప్రజలు దీనస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు, వరదలు వస్తే ఇండ్లు లేక తీవ్ర బట్ట, బుట్ట సర్దుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. వర్షాల కారణంగా జిల్లాలో వేలాది ఎకరాల పంట నీట మునిగిందన్నారు. నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. పూరిగుడిసెల్లో ఉంటున్న పేదలకు పక్కా ఇండ్లు మంజూరు చేయాలని, నిరుద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సర్కార్‌కు బాధ్యత లేదన్నారు. వెంటనే వర్ష బాధితులను ఆదుకోవాలని సీఎంకు విజ్ఞప్తి చేస్తున్నట్లు చెప్పారు.

50 ఏళ్లుగా ఒకే ఒక్క గణనాథుడు

- సమష్టిగా ఉత్సవాలు నిర్వహిస్తున్న వెంకటాపూర్ గ్రామస్థులు



వెంకటాపూర్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడు

నారాయణఖేడ్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మారుమూల గ్రామాలు, గిరిజన తండాల్లో సైతం పోటాపోటీగా వినాయక మండపాలను ఏర్పాటు చేస్తుండగా నారాయణఖేడ్ మండలం వెంకటాపూర్‌లో మాత్రం ఐదు దశాబ్దాలుగా గ్రామస్థులంతా సమష్టిగా ఒకే ఒక గణనాథుడిని ప్రతిష్టిస్తున్నారు. హనుమాన్ ఆలయం వద్ద గణనాథుడిని ప్రతిష్టించి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. గ్రామంలో 1,200 జనాభా ఉన్నప్పటికీ, ఒకే వినాయకుడిని ప్రతిష్టింపజేయడం పలువురిని అబ్బురపరుస్తుంది. గ్రామంలో యువజన సంఘాలు ఎన్ని ఉన్నా ఏకతాటిపై ఒకే వినాయకుడిని ఉంచి ఉత్సవాలు నిర్వహించడంపై గ్రామస్థులను పలువురు అభినందిస్తున్నారు.

ఇళ్లు కూలిన బాధితులకు టార్పాలిన్లు పంపిణీ



బాధిత కుటుంబీకులకు టార్పాలిన్లు పంపిణీ చేస్తున్న చంద్రశేఖర్

చిన్నశంకరంపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని పలు ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. కాగా నిరాశ్రయులైన బాధిత కుటుంబాలకు ఎన్నారై, ప్రజాసేవకుడు కంజర్ల చంద్రశేఖర్ ఇంటి పైకప్పు కోసం టార్పాలిన్లు, నిత్యావసర సరుకులను గురువారం అందజేసి మాట్లాడారు. ప్రజలకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటానని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వామి, యాదగిరి, శ్రీనివాస్, స్వామి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ



కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ చేస్తున్న వాసవీ మా ఇల్లు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు తోపాజి అనంతకిషన్

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వాసవీ మా ఇల్లు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు గురువారం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తోపాజి అనంతకిషన్ రెయిన్ కోటలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వాసవీ మా ఇల్లు సంస్థ ఆధ్వర్యంలో కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అనంతరం తోపాజి అనంతకిషన్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు వర్షంలో పనిచేస్తున్నారని, వారి కోసమే పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి తోపాజి హరీష్, కిషన్, విద్యాసాగర్, బుచ్చిలింగం, కిట్టు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కూన సంతోష్‌కుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జార్జి, నాయకులు మహేష్‌కుమార్, కిరణ్‌గౌడ్, కిరణ్‌గౌడ్, శ్రీహరి, సుధాకర్ పాల్గొన్నారు.

గ్రామగ్రామాన కొలువుదీరిన గణనాథులు

వినాయక చవితి సందర్భంగా మెదక్, సంగారెడ్డి జిల్లా ఆయా మండలాల్లోని గ్రామాల్లో గణనాథులు కొలువుదీరారు. మందిరాలను తలపించేలా మండపాలను తీర్చిదిద్దారు. సాయంత్రం అందులో వినాయక విగ్రహాలను ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షం కారణంగా వినాయక చవితి విగ్రహాల ఊరేగింపుకు ఆటంకం కలిగినప్పటికీ వర్షంలోనే వినాయకులను ప్రతిష్టించారు.

-న్యూస్ నెట్‌వర్క్



జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ కుటుంబ సభ్యులతో కలిసి వినాయకుడికి పూజలు చేస్తున్న దృశ్యం



వెల్దుర్తి మండల పరిధిలోని ఎలుకపల్లిలో కొలువుదీరిన వినాయకుడు



సదాశివపేటలో రుద్రయూత్ అసోషియేషన్ యువత నెలకొల్పిన భారీ మట్టి గణపతి